సాక్షి
కాకినాడ
బుధవారం । 8 । నవంబర్ । 2023



సత్యదీక్షలు ప్రారంభం

అన్నవరం సత్యదేవుని జన్మనక్షత్రం మఖ సందర్భంగా మంగళవారం దేవస్థానంలో శ్రీ సత్యదీక్షలు ప్రారంభమయ్యాయి.

10లో



నయన మనోహరం

వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం రమణీయంగా జరిగాయి.

10లో

డెల్టాలకు 7 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు మంగళవారం 7 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు, మధ్య డెల్టాలకు చెరో 1,500, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

ప్రత్యేక అవసరాల పిల్లలకు ట్యాబ్‌లు

కాకినాడ సిటీ: ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని విద్యా నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఐఈ ఆర్‌పీలకు, ఐఈడీఎస్ఎస్ టీచర్లకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సమకూర్చిన ట్యాబ్‌లను కలెక్టర్ కృతికా శుక్లా, ఎంపీ వంగా గీత మంగళవారం కలెక్టరేట్‌లో అందజేశారు. జిల్లాలోని 21 భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు సేవలు అందించడమే కాకుండా, వారు అవరోధాలను అధిగమించేలా విద్యా నైపుణ్యాలు పెంచుకునేందుకు ట్యాబ్‌లు అందజేస్తున్నామని తెలిపారు. సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయం సమకూర్చిన 250 లెనోవా, సామ్‌సంగ్ ట్యాబ్‌లను 5 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా శాఖ ఆర్‌జేడీ, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జి.నాగమణి, జిల్లా సహిత విద్య కో ఆర్డినేటర్, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి చామంతి నాగేశ్వరరావు, కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి పాల్గొన్నారు.

డయల్ యువర్ కలెక్టర్‌కు ఆరు ఫిర్యాదులు

కాకినాడ సిటీ: ప్రజల సమస్యల్ని నేరుగా తెలుసుకునేందుకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకూ ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఆరుగురు సంక్షేమ పథకాల లబ్ధి, విద్య, ఉపాధి, భూ సర్వే, భూ సమస్యలు, మురికి కాలువల నిర్మాణం, పారిశుద్ధ్యం వంటి సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్ 1800 425 3077కు ఫోన్ చేసి నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, ఏపీ జీఎస్ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాపం పండింది

- పోలీసులకు చిక్కిన అవినీతి తిమింగలాలు
- సుదీర్ఘ విచారణతో నిగ్గు తేలిన నిజం
- రూ.3.50 కోట్ల పైనే అడ్డగోలు దోపిడీ
- చంద్రబాబు బాటలోనే 'తమ్ముళ్లు'



పోలీసులు అరెస్టు చేసిన మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, సర్పంచ్ చెల్లి వెంకటలక్ష్మి, మోహనరావు దంపతులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నట్టు దాదాపు తెలుగు తమ్ముళ్లందరిదీ 'దోచుకో.. పంచుకో.. తినుకో' విధానమే. స్కిల్ స్కామ్‌లో అడ్డంగా బుక్కైన ఆ పార్టీ అధినేత చంద్రబాబు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో 52 రోజుల పాటు రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కంటి శస్త్రచికిత్స పేరుతో ప్రస్తుతం బెయిల్‌పై బయటకు వచ్చారు. 'ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా' అన్నట్టుగా చంద్రబాబు వేసిన అవినీతి బాటలోనే ఆ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు పయనిస్తున్నారు. అయితే, చేసిన పాపాలు ఊరకనే పోవు.. ఎప్పటికీ వెంటాడుతూనే ఉంటాయని అంటారు. ఇదేవిధంగా టీడీపీలో అవినీతిపరుల పాపాల పుట్టలు ఒక్కొక్కటిగా పగులుతున్నాయి. సామర్లకోట మండలం వేట్లపాలెంలో నిధుల కుంభకోణం కేసులో తాజాగా టీడీపీ ప్రజాప్రతినిధులను అరెస్టు చేయడంతో ఈ విషయం మరోసారి స్పష్టమైంది.

పంచాయతీలో 'మేజర్'గా లూటీ

ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన సొమ్మును తెలుగు తమ్ముళ్లు, టీడీపీకి చెందిన వేట్లపాలెం మేజర్ గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు కుమ్మక్కై, దోచుకున్న తీరు విస్తుగొలుపుతోంది. పెద్దాపురం నియోజకవర్గం వేట్లపాలెంలో అక్కడి టీడీపీ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ముఖ్య అనుచరుడు వల్లూరి శ్రీనివాస్. వేట్లపాలెం పంచాయతీకి 2017–21 మధ్య శ్రీనివాస్ ఉప సర్పంచ్‌గా, ఆయన భార్య శేషవేణి సర్పంచ్‌గా పని చేశారు. జిల్లాలోనే అతి పెద్ద గ్రామ పంచాయతీ వేట్లపాలెం. ఇందుకు తగ్గట్టు నిధులు కూడా పుష్కలమే. ఈ గ్రామ పంచాయతీకి జనరల్ ఫండ్ ఏటా రూ.కోటి పైమాటే. దీనికి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులు అదనం. ఇదే అదునుగా టీడీపీ ప్రజాప్రతినిధులు అడ్డగోలు దోపిడీకి తెర లేపారని స్థానికులు మండిపడుతున్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించి, సేవలందిస్తారనే గంపెడాశతో అధికారం అప్పగిస్తే.. తమ నుంచి వసూలు చేసిన జనరల్ ఫండ్‌నే టీడీపీ ప్రజాప్రతినిధులు కొల్లగొట్టిన తీరుపై స్థానికులు నిప్పులు చెరుగుతున్నారు. అప్పట్లో ఈ కుంభకోణం విషయం తెలిసినా ఆ పార్టీ అధికారంలో ఉండటంతో వేట్లపాలెం ప్రజలు పెదవి విప్పే సాహసం చేయలేకపోయారు. మొదటి నుంచీ ఇటువంటి వ్యవహారాల్లో ముందుండే సీనియర్ నాయకుడు గోలి బాబ్జీ మాత్రం ధైర్యం చేసి జిల్లా, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. అదే సమయంలో ఈ కుంభకోణాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకు వచ్చింది. దీంతో అవినీతి తిమింగలాల గుట్టు ఎట్టకేలకు రట్టయ్యింది.

తీవ్రంగా పరిగణించిన కలెక్టర్

టీడీపీ 2014లో అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తరువాత వేట్లపాలెంలో అధికార పగ్గాలు చేపట్టింది. అప్పటి నుంచి నాలుగేళ్ల పాటు ప్రజాధనాన్ని జేబులోకి మళ్లించుకున్నారనే విషయం అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. అందువల్లనే జిల్లా యంత్రాంగం క్రిమినల్ కేసుల వరకూ వెళ్లింది. ప్రజాధనం దుర్వినియోగం చేసిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధుల విషయంలో కలెక్టర్ కృతికా శుక్లా మొదటి నుంచీ సీరియస్‌గా ఉన్నారు. దీంతో జిల్లా పంచాయతీ అధికారులను పరుగులు పెట్టించారు. తొలుత డీఎల్‌పీఓ వై.అమ్మాజీ చేపట్టిన విచారణ మొక్కుబడిగా సాగుతోందని, నిందితులను కాపాడే ప్రయత్నం జరుగుతోందనే ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ కృతికా శుక్లా 2013 నుంచి రికార్డులు పూర్తి స్థాయిలో పరిశీలించి, నివేదిక ఇవ్వాలని కాకినాడ రూరల్ డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తిని అప్పట్లో ఆదేశించారు. దీంతో లోగుట్టు బట్టబయలైంది. నాడు పోలీసులు కేసు నమోదు చేసిన తర్వాత.. ఐదు నెలల సుదీర్ఘ విచారణ అనంతరం నిందితులను అరెస్టు చేసే వరకూ జిల్లా యంత్రాంగం వదిలిపెట్టలేదు.

కొల్లగొట్టారిలా..

వేట్లపాలెం గ్రామ పంచాయతీలో ప్రజాధనం కొల్లగొట్టిన తీరు అధికారులను విస్మయానికి గురి చేసింది. రోడ్లు వేయకుండానే ఉన్నవే కొత్తగా వేసినట్టు.. డ్రైన్లలో పూడిక తీయకుండానే తీసినట్టు.. మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయకుండానే చేసినట్టు.. చీపుర్లు, బ్లీచింగ్ కొనుగోలు చేయకుండానే చేసినట్టు.. ఇలా ఒకటేమిటి అవినీతికి అడ్డే లేదన్నట్టుగా బిల్లులు డ్రా చేసుకుని అడ్డంగా దోచుకున్నారు. చివరకు ప్రజల నుంచి కుళాయి, ఇంటి పన్నుల రూపంలో వసూలు చేసిన సొమ్ములు కూడా జమ చేయకుండా కొల్లగొట్టారంటే.. అప్పట్లో అధికారాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ నాయకులు పాల్పడిన అవినీతి ఎంత పరాకాష్టకు చేరిందో అర్థం చేసుకోవచ్చు. అప్పటి సర్పంచ్ వల్లూరి శేషవేణి భర్త, ఉప సర్పంచ్ శ్రీనివాస్ అవినీతి వారసత్వాన్ని.. వారి అనంతరం అధికారంలోకి వచ్చిన అదే పార్టీకి చెందిన ప్రస్తుత సర్పంచ్ చెల్లి వెంకటలక్ష్మి కూడా కొనసాగించారు. దీంతో ఈ వ్యవహారంలో ఆమె కూడా అరెస్టయ్యారు. ఈ కుంభకోణంలో మొత్తం 11 మంది నిందితులకు గాను ఒకరు మృతి చెందాడు. మాజీ సర్పంచ్ శేషవేణి పరారీలో ఉన్నారు. మాజీ ఉప సర్పంచ్ వల్లూరి శ్రీనివాస్, సర్పంచ్ చెల్లి వెంకటలక్ష్మి, ఆమె భర్త చెల్లి మోహనరావు, పంచాయతీ సిబ్బంది లక్ష్మీసూర్యకళ, రామాంజనేయులు పాపం పండి అరెస్టయ్యారు. శేషవేణి, మిగిలిన నలుగురి కోసం పోలీసులు వేటాడుతున్నారు.

వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'


కాకినాడ
దేశం అవినీతి పంచాయతీ

వేట్లపాలెంలో అవినీతిపై జూన్ 25న 'సాక్షి' ప్రచురించిన కథనం

టీడీపీకి చెందిన ప్రస్తుత సర్పంచ్, మాజీ సర్పంచ్‌ల హయాంలో సుమారు రూ.3.50 కోట్ల ప్రజాధనాన్ని అడ్డంగా మేసేసిన కుంభకోణాన్ని గత జూన్ 25న 'దేశం అవినీతి పంచాయతీ' శీర్షికన 'సాక్షి' వెలుగులోకి తీసుకవచ్చింది. ఈ వ్యవహారంపై కలెక్టర్ కృతికా శుక్లా అప్పట్లో శాఖాపరంగా విచారణకు ఆదేశించారు. దీనిపై జరిగిన సమగ్ర విచారణలో ప్రజాధనం దుర్వినియోగం కావడం వాస్తవమేనని విచారణాధికారులు నిగ్గు తేల్చారు. దీంతో జిల్లా పంచాయతీ అధికారుల ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి, మంగళవారం నిందితులను అరెస్టు చేయడంతో తొలి అంకం ముగిసింది. ఇక వారు అడ్డంగా దోచేసిన ప్రజాధనాన్ని స్వాధీనం చేసుకుని, పంచాయతీ పద్దుకు తిరిగి కట్టించడం ఒక్కటే మిగిలి ఉంది.

ప్రజాధనం దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు



ప్రజాధనం దుర్వినియోగం చేస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవు. ప్రజల సొమ్ము ప్రతి పైసాకు బాధ్యులు జవాబుదారీగా ఉండాలి. నిధులు ఖర్చు చేసే సమయంలో పారదర్శకంగా పూర్తి స్థాయిలో రికార్డులు తయారు చేయాలి. ఈ విషయంలో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి.

– కృతికా శుక్లా, కలెక్టర్, కాకినాడ జిల్లా

సొమ్ము రికవరీ చేయాలి



నిధులు పక్కదారి పడితే నాలాగే ప్రతి ఒక్కరూ ధైర్యంగా ముందుకు వచ్చి అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి, సకాలంలో చర్యలు తీసుకోబట్టే ఈ కుంభకోణంలో అరెస్టులు జరిగాయి. ప్రజలకు మేలు జరుగుతుందని చాలా సంతోషంగా ఉంది. ప్రజల సొమ్ము స్వాహా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. కొల్లగొట్టిన సొమ్మును రికవరీ చేయాలి.

– గోలి బాబ్జీ, వేట్లపాలెం

రైతు అభ్యుదయమే ప్రభుత్వ లక్ష్యం



రైతులకు వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం కింద నమూనా చెక్కును అందజేస్తున్న ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా

- అందుకే విభిన్న సంక్షేమ పథకాలు
- ఎంపీ వంగా గీత
- రైతుభరోసా నమూనా చెక్కు పంపిణీ

కాకినాడ సిటీ: రైతు అభ్యుదయం, వ్యవసాయ రంగ పురోగతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. రాష్ట్రంలోని రైతులకు వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం కింద ఈ ఏడాది రెండో విడత ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ప్రారంభించారు. బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో నేరుగా ఆయన నిధులు జమ చేసిన అనంతరం.. జిల్లాలోని 1,80,434 మంది రైతులకు మొత్తం రూ.74.71 కోట్ల లబ్ధికి సంబంధించిన నమూనా చెక్కును ఎంపీ గీత, కలెక్టర్ కృతికా శుక్లా లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ, సాగు కోసం అప్పు చేయాల్సిన దుస్థితి రానీయకూడదనే ఆశయంతోనే వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం కింద రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి రైతు కుటుంబానికీ ప్రభుత్వం ఏటా రూ.13,500 ఆర్థిక సహాయం అందిస్తోందని వివరించారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని 2019 అక్టోబర్ 15న కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. సొంత భూమి సాగు చేసుకుంటున్న వారితో పాటు అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కౌలు రైతులు, అటవీ, దేవదాయ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు కూడా రైతుభరోసా సహాయం అందిస్తోందని చెప్పారు.

తొలి విడతగా మే నెలలో రూ.7,500, రెండో విడతగా అక్టోబర్‌లో రూ.4 వేలు, మూడో విడతగా జనవరిలో రూ.2 వేల చొప్పున ఈ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది రెండో విడత వైఎస్సార్ రైతు భరోసా సహాయం అందించిందని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి, విద్య, ఆరోగ్యంతో పాటు రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు పంట నష్టపోతే అదే సీజన్‌లో పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవడం హర్షణీయమన్నారు. విత్తనాల నుంచి విక్రయాల వరకూ వరకూ రైతులకు అండగా నిలుస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని ఎంపీ గీత అన్నారు.

కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ, ఈ విడతతో కలిపి గడచిన ఐదేళ్లుగా వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద జిల్లాలో మొత్తం రూ.1,085.50 కోట్ల మేర రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించిందని వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఉత్పాదనలు సాధించాలని రైతులను కోరారు. జిల్లాలో నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న పంటలను కాపాడేందుకు అన్ని చర్యలూ చేపడుతున్నామన్నారు. పటిష్ట నీటి సరఫరా కార్యాచరణతో రబీలో పూర్తి ఆయకట్టుకు నీరందిస్తామని చెప్పారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లంక ప్రసాద్ మాట్లాడుతూ, ఐదేళ్లుగా క్రమం తప్పకుండా వైఎస్సార్ రైతు భరోసా సహాయాన్ని రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్, రైతులు పాల్గొన్నారు.

అన్నదాతకు ఆర్థిక చేయూత



నాలుగేళ్లుగా వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకం కింద ఆర్థిక సహాయం పొందుతున్నాను. దీంతో పాటు గత ఏడాది ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్ కూడా పొందాను. గతంలో పంట పెట్టుబడికి అధిక వడ్డీలకు అప్పులు చేసేవాళ్లం. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు చాలా మేలు జరిగింది. కొత్తగా ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాల ద్వారా గ్రామ స్థాయిలోనే రైతులకు అన్ని సేవలూ అందుబాటులోకి తెచ్చారు. రైతులను ఇంతలా ఆదుకుంటున్న ప్రభుత్వాన్ని గత 20 ఏళ్లలో చూడలేదు.

– పైలా గోవిందు, నదకుదురు, కరప మండలం

రైతు అనుకూల ప్రభుత్వం



సుమారు మూడు దశాబ్దాలుగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాను. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. ఇవి రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయి. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తూండటంతో రైతులకు దళారుల బెడద తప్పింది.

– ఎంఆర్‌కే చౌదరి, అచ్చంపేట, సామర్లకోట మండలం

ఘనంగా జన్మనక్షత్ర పూజలు

అన్నవరం: సత్యదేవుని జన్మ నక్షత్రం మఖ సందర్భంగా స్వామి, అమ్మవార్ల మూలవిరాట్టుకు మంగళవారం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, యాగశాలలో ఆయుష్య హోమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున 3 గంటలకు ఆలయాన్ని తెరిచిన అర్చకులు సత్యదేవుడు, అమ్మవార్ల మూలవిరాట్టుకు పంచామృతాలతో మహన్యాసపూర్వక అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను స్వర్ణాభరణాలు, సుగంధభరిత పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. ఉదయం 7 గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. స్వామి వారి యాగశాలలో సత్యదేవుడు, అమ్మవార్లకు ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ ఆయుష్య హోమం నిర్వహించారు.

సేకరించిన భూములకు త్వరితగతిన చెల్లింపులు

కాకినాడ సిటీ: జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలకు సేకరించిన భూములకు సంబంధించి రైతులకు త్వరితగతిన సొమ్ములు చెల్లించాలని అధికారులను ఎంపీ వంగా గీత ఆదేశించారు. జాతీయ రహదారులు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలకు భూసేకరణ, సంబంధిత అంశాలపై ఆయా శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం ఎంపీ సమీక్షించారు. జిల్లాలో వాకలపూడి నుంచి అచ్చంపేట మీదుగా జాతీయ రహదారి 516, పిఠాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ సత్వరం పూర్తి చేసి, పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చూడాలని అన్నారు. సాధ్యమైనంత మేరకు రైతులకు ఇబ్బంది లేకుండా భూసేకరణ ప్రక్రియ నిర్వహించాలన్నారు.

కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ, జాతీయ రహదారులు, రైల్వే ఓవర్ బ్రిడ్జిల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. ఇందుకు రెవెన్యూ, సర్వే, జాతీయ రహదారుల అధికారులు ఉమ్మడిగా తనిఖీ చేసి, నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రధానంగా సామర్లకోట – రాజానగరం రహదారి నిర్మాణ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హరిప్రసాద్‌బాబు, కాకినాడ ఆర్‌డీఓ ఈట్ల కిషోర్, జాతీయ రహదారుల పీడీ సురేంద్రనాథ్, ఇరిగేషన్ అధికారులు, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

పెద్దాపురంలో కారు బీభత్సం

ముగ్గురికి తీవ్ర గాయాలు

పెద్దాపురం: అనుభవం లేని వ్యక్తి కారు డ్రైవ్ చేయడంతో ముగ్గురు గాయాల పాలైన ఘటన మంగళవారం ఉదయం పెద్దాపురం దర్గా సెంటర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం డ్రైవింగ్‌లో అనుభవం లేని బంగారమ్మ గుడి వీధికి చెందిన ముప్పన వీరభద్రం సరదాగా కారు నడిపి నాలుగు బైక్‌లు, ఆటోను బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో అంబిక, సమ్మంగి దేవి, మరో యువకుడికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అజాగ్రత్తగా కారు నడిపిన వీరభద్రంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పెద్దాపురం ఎస్‌ఐ వి.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై హత్యాయత్నం

ప్రత్తిపాడు: యువకుడిపై హత్యాయత్నం ఘటన ప్రత్తిపాడులో సోమవారం అర్ధరాత్రి జరిగింది. స్థానిక పోలీసుల కథనం మేరకు ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఎదుటి వీధిలో ఉంటున్న పోరుమిల్లి కిశోర్ జీడిపిక్కల ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన కసిరెడ్డి అప్పారావు కుమార్తె గత నెల 26వ తేదీన ఉరి వేసుకుని మృతి చెందింది. తమ కుమార్తె మృతికి కిశోర్ కారణమని అప్పారావు భావించాడు. అప్పారావు, గనిశెట్టి సత్యనారాయణ, ఎన్నపరెడ్డి నాగ వెంకట రమణతో కలిసి కిశోర్ ఇంటికి వెళ్లి కత్తితో దాడి చేసి గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన కిశోర్‌ను స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కిశోర్ తల్లి సీతారత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నయన మనోహరం


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు


స్వామివారికి అష్టదళ పాద పద్మారాధన


శ్రీకృష్ణ అలంకరణతో సాగిన సూర్యప్రభ వాహన సేవ


సప్త కలశారాధన నిర్వహిస్తున్న పండితులు

- రమణీయంగా కోనేటి రాయుడి బ్రహ్మోత్సవాలు
- సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై ఊరేగింపు
- ఘనంగా అష్టదళ పాద పద్మారాధన

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం రమణీయంగా జరిగాయి. పట్టు వస్త్రాలు, సర్వాభరణాలతో ముస్తాబైన స్వామి, అమ్మవార్లను భక్తులు తన్మయత్వంతో తిలకించారు. సూర్య, చంద్రవాహనాలపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సప్తకలశారాధన, వసంతోత్సవం, అష్టదళపాద పద్మారాధన, ప్రధాన హోమాలు నిర్వహించి, నీరాజన మంత్రపుష్పాల అనంతరం స్వస్తి వచనం పలికారు. శ్రీ కృష్ణ అలంకరణతో సూర్యప్రభ వాహన సేవ నిర్వహించారు. సాయంత్రం మోహినీ అలంకరణతో చంద్రప్రభ వాహన సేవ సాగింది. ఎస్సై బీవై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

స్వామివారికి పట్టువస్త్రాలను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, సభ్యులు మన్యం భాను, మెర్ల వేంకటేశ్వరరావు దంపతులు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు దంపతులు సమర్పించారు.

సూర్య, చంద్ర ప్రభ వాహనాల విశిష్టత

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీనివాసుడు సూర్య ప్రభ వాహనంపై ఊరేగుతాడు. సప్త అశ్వాలతో కదిలే ఈ వాహనం మీద నిలిచే స్వామి.. సూర్యుని ప్రతీకగా ఎర్రటి పూలమాలను ధరిస్తారు. సాయంత్రం చంద్ర ప్రభ వాహనంపై భక్తుల చెంతకు వస్తారు. పున్నమి నాటి చంద్రుడు పోలిన చంద్రవాహనం మీద శాంతికి, స్వచ్ఛతకు చల్లదనానికి ప్రతీక ఆయన తెల్లని వస్త్రాలతో కనుల పండగ చేస్తారు. సూర్య, చంద్ర ప్రభ వాహనంపై ఉన్న స్వామిని దర్శించుకుంటే కష్టాలు దరి చేరవని భక్తుల నమ్మకం.

నేటి కార్యక్రమాలు

బుధవారం ఉదయం విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, అష్టోత్తర శతకలశాభిషేకం, లక్షతులసిపూజ, లక్ష్మి వేంకటేశ్వర మూల మంత్రపూర్వక వేంకటేశ్వర హోమం, రాజాధిరాజ అలంకరణతో గజవాహన సేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అమ్మవారికీ త్వరలో వజ్ర కిరీటం

- రూ.కోటిన్నర వ్యయమవుతుందని అంచనా
- ఆలస్యంపై 'అందివస్తే అలంకారమే' శీర్షికన 'సాక్షి'లో కథనం
- స్పందించిన ఈఓ చంద్రశేఖర్ అజాద్
- సందేహాలను నివృత్తి చేస్తూ దాతకు అనుమతి లేఖ

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: రత్నగిరి వాసుడు శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవేరి అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి వజ్ర కిరీటం తయారీకి మార్గం సుగమం అయింది. దాత, ప్రముఖ పారిశ్రామికవేత్త, పెద్దాపురంలోని శ్రీలలితా రైస్ ఇండస్ట్రీ అధినేతలలో ఒకరైన మట్టే సత్యప్రసాద్ దంపతులు గతేడాది సత్యదేవునికి రూ.రెండు కోట్ల వ్యయంతో వజ్ర కిరీటం చేయించి సమర్పించారు. ఆ సందర్భంగా అమ్మవారికి కూడా వజ్రకిరీటం చేయించేందుకు దాత సంసిద్ధత వ్యక్తం చేశారు. అయితే వజ్రకిరీటం అమ్మవారికి శాశ్వతంగా అలంకరించాలనేది దాత మట్టే సత్యప్రసాద్ కోరిక. ఇందుకు దేవదాయ శాఖ నిబంధనలు అంగీకరించవని, నిర్దిష్ట కాలపరిమితి ముగిసిన తర్వాత ఇంతకన్నా ఎక్కువ వ్యయంతో పెద్ద కిరీటం మరో దాత తయారు చేయిస్తే అప్పుడు దాతతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. దీనిపై దాత సత్యప్రసాద్ కొంత అసంతృప్తికి గురైనట్లు సమాచారం. ఫలితంగా కిరీటం తయారీ ఆలస్యమైంది.

దీంతో సత్యదేవుడు వజ్రకిరీటంతో భక్తులకు దర్శనమిస్తుంటే అమ్మవారు స్వర్ణకిరీటంతో దర్శనమిస్తుండడం భక్తులను అసంతృప్తికి గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో వజ్రకిరీటం తయారీ ఆలస్యంపై 'అందివస్తే అలంకారమే ' శీర్షికన సోమవారం 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. దీనిపై దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ స్పందించి వజ్రకిరీటం తయారీకి దాత మట్టే సత్యప్రసాద్‌కు మంగళవారం లిఖిత పూర్వక అనుమతి ఇస్తూ లేఖ పంపించారు. ఆ లేఖలో దాత సందేహాలను ఈఓ నివృత్తి చేశారు. దీంతో దీనిపై స్పందించిన దాత త్వరలోనే వజ్ర కిరీటం చేయించి అమ్మవారికి సమర్పిస్తానని తెలిపారు. ఈ కిరీటం తయారీకి సుమారు రూ.కోటిన్నర వ్యయం అవుతుందని అంచనా.



త్వరగా చేయించమని దాతను కోరాం

సాధ్యమైనంత త్వరగా వజ్ర కిరీటం తయారు చేయించి అమ్మవారికి సమర్పించాలని దాతను కోరాం. గతంలో స్వామివారికి వజ్ర కిరీటం చేయించనపుడు కర్ణాభరణాలు చేయించలేదు. వాటిని కూడా చేయించాలని కోరాం. దాత కూడా అంగీకరించారు. కార్తికమాసంలో అమ్మవారు వజ్ర కిరీటంతో భక్తులకు దర్శనమివ్వాలని కోరిక.

– ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్, ఆలయ ఈఓ

పూర్వజన్మ సుకృతం

సత్యదేవునికి వజ్రకిరీటం చేయించిన తనకు అమ్మవారికి కూడా వజ్ర కిరీటం చేయించే అదృష్టం దక్కడం పూర్వజన్మ సుకృతం. సాధ్యమైనంత త్వరలోనే వజ్ర కిరీటం చేయించి అమ్మవారికి సమర్పించేందుకు ప్రయత్నిస్తాను. కార్తికమాసంలోనే కిరీటం సమర్పించే అవకాశం అమ్మవారు తనకు ఇవ్వాలని వేడుకుంటున్నా. తనకు ఈ అవకాశం కల్పించిన దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్‌కు కృతజ్ఞతలు.

– మట్టే సత్యప్రసాద్, దాత

సత్యదీక్షలు ప్రారంభం


సత్యదీక్ష సందర్భంగా స్వామి, అమ్మవారికి పూజలు చేస్తున్న పండితులు

అన్నవరం : శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి జన్మనక్షత్రం మఖ సందర్భంగా మంగళవారం దేవస్థానంలో శ్రీ సత్యదీక్షలు ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచి విడతల వారీగా భక్తులు రత్నగిరిపై శ్రీసత్యదేవుని ఆలయంతో బాటు శ్రీవనదుర్గ, శ్రీకనకదుర్గ, కొండ దిగువన వివిధ ఆలయాలలో అర్చకులు, గురుస్వాముల చేతుల మీదుగా ఈ దీక్షలు స్వీకరించారు. ఈఓ చంద్రశేఖర్ అజాద్, వ్రత పురోహితులు, అర్చకులతో సహ సుమారు వేయి మంది ఈ దీక్షలు స్వీకరించారు. ఈ సందర్భంగా సత్యదేవుని వార్షిక కల్యాణ మంటపం వద్ద సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అఖండ దీపం ఏర్పాటు చేశారు. దీక్షలు పూర్తయ్యేవరకు ఈ దీపం వెలుగుతూ ఉంటుందని పండితులు తెలిపారు.

దీక్షలు స్వీకరించిన మూడు వేల మంది

కాకినాడ జిల్లా వ్యాప్తంగా మూడు వేల మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో వేయి మంది సత్యదీక్షలు చేపట్టినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. 27 రోజుల పాటు సత్యదీక్షలు కొనసాగుతాయి. డిసెంబర్ నాలుగో తేదీన స్వాములు సత్యదేవుని సన్నిధిన ఇరుముడులు సమర్పించి దీక్ష విరమించనున్నారు. సుమారు రెండు వేల మందికి ఉచితంగా దీక్షా వస్త్రాలు, మాలలు, పూజ పుస్తకం దేవస్థానం తరఫున పంపిణీ చేశారు.

ప్రతీ ఆదివారం సత్య భజన

సత్యదీక్ష చేపట్టిన పురుషులను సత్యదేవ, మహిళలను సత్య లేదా సత్తమ్మగా పిలవాలి. ప్రతి ఆదివారం వార్షిక కల్యాణ మంటపం వద్ద సత్యదీక్ష స్వాములతో భజన ఉంటుంది. డిసెంబర్ మూడో తేదీ రాత్రి ఏడు గంటల నుంచి పడిపూజ నిర్వహిస్తాం. నాలుగో తేదీ ఉదయం ఏడున్నర గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుంది. గిరిప్రదక్షిణ అనంతరం ఇరుముడులు సమర్పించాలి. పురుషులు కేశఖండన చేయించుకోవాలి. అనంతరం కుటుంబ సభ్యులతో కలసి సత్యదేవుని వ్రతాలు ఆచరించాలి.


– ఈఓ చంద్రశేఖర్ అజాద్

కాలిన గాయాలతో చికిత్స పొందుతూ మహిళ మృతి

కరప: కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో కాలిన గాయాలతో చికిత్స పొందుతూ ఒక మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన కథనం మేరకు కరప మండలం ఉప్పలంక గ్రామానికి చెందిన లంకాడి ధనలక్ష్మి(60) భర్త మరణించడంతో ఒంటరిగా జీవిస్తోంది. ఆమెకు ముగ్గురు కుమారులు ఉండగా, వివాహం కావడంతో వేరుగా ఉంటున్నారు. డ్రైవర్‌కాలనీలో ఉంటున్న చిన్న కుమారుడు భూలోకం రోజూ తల్లికి భోజనం తీసుకొచ్చి ఇస్తుంటాడు. ఈ నేపథ్యంలో ధనలక్ష్మి అక్టోబర్ 31వ తేదీన సాయంత్రం అగ్గిపుల్లతో చుట్ట కాల్చుకోవడానికి ప్రయత్నించింది. ప్రమాదవశాత్తూ అగ్గిపుల్ల చీరపై పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ధనలక్ష్మి భయంతో కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఆమెను చికిత్స కోసం 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కరప ఏఎస్‌ఐ జి.ప్రసన్నకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి కబడ్డీ టోర్నీ

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థల ప్రాంగణంలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ (పురుషులు) టోర్నమెంట్‌కు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలకు ఆరు రాష్ట్రాలకు చెందిన 113 యూనివర్సిటీల నుంచి సుమారు 1,200 మంది ఆటగాళ్లు ఈ పోటీలలో పాల్గొంటారని తెలియజేశారు. జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ జీవీఆర్ ప్రసాదరాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మంత్రి ఆర్‌కే రోజా, అతిథులుగా ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, నన్నయ్య యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కె.పద్మరాజు, ఇండియన్ యూనివర్సిటీస్ జాయింట్ సెక్రటరీ బల్జిత్ సింగ్ సేఖోన్, ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి పాల్గొంటారన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి

నవోదయ ప్రవేశ పరీక్షల దరఖాస్తు గడువు పొడిగింపు

పెద్దాపురం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11వ తరగతి ప్రవేశ పరీక్షల దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు తేదీ పొడిగించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య తెలిపారు. మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ ఈ నెల 7వ తేదీతో ముగిసిన గడువు తేదీని మరో వారం రోజులు పెంచుతూ విద్యాలయ సమితి నిర్ణయం తీసుకుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.